క్లుప్తంగా

మైక్ సెట్ వితరణ



విజయపురం (నగరి) : మండలంలోని శ్రీహరి పురానికి చెందిన, పూర్వ విద్యార్థి చెంచురాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.25వేల విలువజేసే మైక్ సెట్ సిస్టం అందజేశారు. శనివారం హెచ్ఎం సోమశేఖర్ కు దీన్ని అందించారు. హెచ్ఎం మాట్లాడుతూ పూర్వ విద్యార్థిగా చెంచురాజు సేవలు ప్రశంసనీయమని అభినందించారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవ



నాగలాపురం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంలో ఉన్న శ్రీ వేదవల్లీ సమేత వేదనారయణస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం అభిషేకం అనంతరం స్వామివారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చి పూజలు చేశారు. తదుపరి ఊంజల్ సేవను వేడుకగా నిర్వహించారు. భక్తులు వీక్షించి తరించారు.

పకడ్బందీగా ఆరోగ్య సురక్ష సర్వే



మాట్లాడుతున్న పీహెచ్‌సీ కమిటీ చైర్మన్

పాలసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ ఎస్.శివప్రకాష్‌రాజు అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆరోగ్య శాఖ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అందు కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం తీసుకొచ్చారన్నారు. ప్రతి పంచాయతీలో వైద్య సిబ్బంది, వలంటీర్లు ప్రజల ఆరోగ్య వివరాలను సేకరించాలన్నారు.

ఉపాధిలో రూ.37 వేల రికవరీ



సామాజిక తనిఖీ ప్రజావేదికలో అధికారులు, ప్రజాప్రతినిధులు

పాలసముద్రం: జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఏడాదికి వంద రోజులు పనులు కల్పించాలని ఉపాధిహామీ పథక సంచాలకులు గంగాభవాని అన్నారు. శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ నీలకంటేశ్వరరెడ్డి సమక్షంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. పది రోజుల పాటు జరిగిన పనులను డీఆర్‌పీలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్క్‌సైట్స్ నేమ్ బోర్డు కోసం బిల్లులు తీసుకుని బోర్డు పెట్టని వారి దగ్గర నుంచి రూ.37 వేలు రికవరీ చేయించారు. ఏపీడీ సుబ్రమణ్యం, ఏపీఓ మీనా కుమారి పాల్గొన్నారు.

తిరుచ్చిపై ప్రసన్నుడి కటాక్షం



తిరుచ్చిపై విహరిస్తున్న స్వామివారు

పుత్తూరు రూరల్: అప్పలాయగుంటలో టీటీడీ అనుబంధంలో ఉన్న ప్రముఖ శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. తిరుచ్చిపై విహరిస్తూ స్వామివారు భక్తులను కటాక్షించారు. వేకువ జామున సుప్రభాత సేవతో శ్రీనివాస స్వామిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేతంగా ప్రసన్న శ్రీవేంకటేశ్వరస్వామిని పట్టు పీతాంబరాలు, విశేష సర్వాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువు దీర్చారు. భక్తి కీర్తనల నడుమ ఊంజల్ సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరులతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. తదుపరి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ తిరువీధుల్లో స్వామివారు విహరించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయ ఆలయ అధికారి శివకుమార్ పర్యవేక్షించారు.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్

- క్రీడాకారులతో కళకళలాడిన మైదానాలు
- హోరాహోరీగా మండల స్థాయి పోటీలు
- నియోజకవర్గ స్థాయికి క్రీడాకారుల ఎంపిక



నగరి: కబడ్డీ ఆడుతున్న బాలికలు

నగరి : స్కూల్ గేమ్స్‌లో భాగంగా శనివారం మైదానాలు క్రీడాకారులతో కళకళలాడాయి. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడలకు ప్రాచుర్యం కల్పించే ఉద్దేశంతో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ మైదానంలో అండర్- 14, 17 బాల, బాలికలకు మండల స్థాయి కబడ్డీ, యోగా పోటీలు నిర్వహించి నియోజకవర్గ స్థాయికి క్రీడాకారులను ఎంపిక చేశారు. పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో అండర్-14, 17 బాల, బాలికలకు మండల స్థాయి వాలీబాల్ పోటీలు నియోజక స్థాయి ఎంపికలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం, ప్రధానోపాధ్యాయులు పార్వతీదేవి, శ్యామలాదేవి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. సుమారు 200 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. మండల స్థాయి పోటీలను మండల ఇన్‌చార్జ్ చెన్నకేశవులు, నియోజకవర్గ ఇన్‌చార్జి మణి, ఉమెన్ సీనియర్ పీడీ రాజేశ్వరి, పీడీలు చంద్రమ్మ, సింధు, స్వప్న, గౌరీ సానీ, గీతమ్మ ఆధ్వర్యంలో నిర్వహించగా, నియోజవర్గ స్థాయి క్రీడాకారుల ఎంపికకు సెలక్షన్ కమిటీ సభ్యులు సతీష్, సుమన్, విజయ్, వేలు, కేశవులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. 2010, జనవరి ఒకటి తరువాత జన్మించిన విద్యార్థులు అండర్-14 క్యాటగిరికి, 2007 జనవరి ఒకటి తర్వాత జన్మించిన విద్యార్థులు అండర్-17 క్యాటగిరి పోటీల్లో పాల్గొన్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్‌బాబు తెలిపారు. త్వరలో మండలస్థాయి ఖోఖో, త్రోబాల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక పూర్తి చేస్తామన్నారు. తదుపరి నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తామన్నారు.

నింద్రలో..

నింద్ర: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎంఈఓ వసుమతిదేవి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో అండర్ -14 కబడ్డీ, వాలీబాల్ క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. పీడీలు జ్ఞానకుమార్, సుకుమారి, తదితరులు పాల్గొన్నారు.





నగరి : కబడ్డీ, వాలీబాల్,యోగా నియోజకవర్గ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఎంఈవోలు, హెచ్‌ఎంలు, పీడీలు, నింద్ర : క్రీడలను ప్రారంభిస్తున్న ఎంఈఓ

గడప గడపలో 'సంక్షేమ' కాంతులు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. శనివారం మండలంలోని గాజంకి సచివాలయం పరిధిలోని గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం నారాయణస్వామి మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 98 శాతం హామీలను నెరవేర్చిన ఘనత జగనన్నదేనన్నారు. పేదల ప్రగతికి చిత్తశుద్ధితో పని చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా లేనిపోని ఆరోపణలు చేస్తూ జగన్ సర్కారుపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని తెలిపారు. గత టీడీపీ పాలనలో అన్ని పథకాల్లో అవినీతి చోటుచేసుకుందని.. ఇప్పుడు జగనన్న ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి జగనన్నను సీఎం చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ హరోహరరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు రాధిక రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మురగయ్య, పార్టీ నాయకులు బాలాజీ, శేఖర్‌రాజు, ధనంజయరెడ్డి, కృష్ణారెడ్డి, ధనంజయవర్మ, పట్నం ప్రభాకర్‌రెడ్డి, చందురాజు, చంద్రయ్య, వరాలు రెడ్డి, దొరస్వామి పాల్గొన్నారు.

గ్రామాలకు వెళితే అభివృద్ధి తెలుస్తుంది



మాట్లాడుతున్న గోపీనాథ్

విజయపురం (నగరి) : కళ్లముందు అభివృద్ధి కనిపిస్తున్నా ప్రభుత్వంపై టీడీపీ నాయకులు ఇష్టం వచ్చినట్లు అవాకులు చెవాకులు పేలితే తగిన బుద్ధి చెబుతామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు హెచ్చరించారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎంపీటీసీ సభ్యుడు రాజ్‌గోపాల్, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు సరస్వతీ, సర్పంచ్ కుమార్, నాయకులు భాస్కర్‌రెడ్డి, శరత్, కిషోర్ రెడ్డి, ధనంజేయులురాజు, సతీష్‌తో కలసి పార్టీ మండల కన్వీనర్ గోపినాథ్ మాట్లాడారు. టీడీపీ దృష్టిలో అభివృద్ధి అంటే నాయకులు దోచుకోవడం, దాచుకోవడమని, కానీ తమ ప్రభుత్వం ప్రజా, గ్రామాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తోందని తెలిపారు. తాము ఉన్న గ్రామాల్లోనే పాఠశాలలు, వైద్యశాలలకు వెళ్లి చూస్తే అభివృద్ధి అంటే ఏంటో తెలుస్తుందన్నారు. సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలే అభివృద్ధికి సాక్ష్యాలన్నారు. ఇంటి వద్దకే పెన్షన్లు, పిల్లల చదువుకోసం అమ్మ ఒడి, విద్యాదీవెన, విదేశీ విద్యాదీవెన, వసతిదీవెన, గోరుముద్ద, విద్యా కానుక, ఆసరా, చేయూత, జగనన్నతోడు, కాపు నేస్తం ఇలా ఎన్నో పథకాలతో నేడు ప్రజలు లబ్ధిపొందుతున్నారని, వీరిలో టీడీపీ మద్దతుదారులు కూడా ఉన్నారని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ పేరిట ఇంటి వద్దే వైద్యసేవలు అందుతున్నాయని తెలిపారు.

డీఎస్పీకి కృతజ్ఞతలు

పుత్తూరు రూరల్: పుత్తూరు డీఎస్పీ వై.శ్రీనివాసరావ్‌ను జాతర కమిటీ సభ్యులు శనివారం సత్కరించారు. గంగమ్మ జాతర సందర్భంగా గట్టి బందోబస్తు కల్పించి, కార్యక్రమం విజవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, వీక్కీ, వెంకటేష్, రవియాదవ్, సుధాకర్, కుమార్, గోపి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కార్వేటినగరం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కొల్లగుంట హరిజనవాడకు చెందిన రాజ కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేలు అందజేశారు. సర్పంచ్ దివ్యగాంధీ శనివారం బాధిత కుటుంబానికి నగదు అందించారు. కాగా మృతుడికి ఐదుగురు ఆడపిల్లలు ఉన్నారు.కో ఆప్షన్ సభ్యుడు పట్నం ప్రభాకర్ పాల్గొన్నారు.

కొలువుకు సిద్ధమైన గణపయ్యలు

చిన్నారులు, పెద్దలు ఉత్సాహంగా జరుపుకునే వినాయక చవితి సందడి మొదలైంది. పల్లె, పట్టణం, వీధి, కాలనీ, తేడా లేకుండా వేడుకల నిర్వహణకు సన్నాహాలు ఊపందుకొన్నాయి. సోమవారం వినాయక చవితిని పురస్కరించుకుని నిర్వహణ కమిటీలు మండపాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పోటీపడుతూ విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ)తో తయారైన విగ్రహాల వినియోగం ఏమాత్రం ఆమోద యోగ్యం కాదని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు. ఇందుకు అనుగుణంగా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో మట్టి గణపతులను ప్రోత్సహిస్తోంది.



విక్రయాలకు సిద్ధంగా వినాయక విగ్రహాలు

పుత్తూరు రూరల్: వినాయక చవితి వేడుకలకు విగ్రహాలు సిద్ధమయ్యాయి. మార్కెట్‌లో 2 నుంచి 12 అడుగుల ఎత్తుతో రంగు రంగుల విగ్రహాలు లభ్యమవుతున్నాయి. విగ్రహ తయారీ కేంద్రాల వద్ద అడ్వాన్సులు ఇచ్చి నచ్చిన బొమ్మలను కొందరు బుక్ చేసుకొంటున్నారు. పుత్తూరు మండలం కల్యాణపురం, మహాలక్ష్మీపురం, కేఎంఅగ్రహారం గ్రామాల వద్ద సుమారు 70 కుటుంబాల వారు విగ్రహాల తయారీపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వీరందరూ బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకొని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఏటా ఫిబ్రవరి నుంచి ఆరు నెలల పాటు విగ్రహాల తయారు చేసి చవితికి అమ్మకాలకు పెడుతారు. ఒక్క పుత్తూరులోనే రూ.50 లక్షలకు పైగా వ్యాపారం జరుగుతుంది. తర్వాత విగ్రహాల తయారీకి ఆరు నెలలు విరామం ఇస్తారు. ఈ సమయంలో ఇతర కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తారు. పుత్తూరు పట్టణంలోని దాదాపు అన్ని ప్రధాన వీధుల్లో విగ్రహాల ఏర్పాట్లు జోరందుకొన్నాయి. మూడు, ఐదు, తొమ్మిది రోజుల వేడుకలకు ఆయా ఉత్సవ కమిటీలు పోటీపడుతున్నాయి. దీంతో పట్టణంలో చవితి సందడి ఊపందుకొంటోంది.



మట్టి గణపతులు

మట్టి విగ్రహాలకు ప్రాధాన్యత ఇవ్వండి



మట్టి వినాయకులను పూజించి పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. పీఓపీ విగ్రహాలకు వాడే రంగుల వల్ల పర్యావరణానికి హాని కలిగుతుంది. ఈ రంగులలోని రసాయనాలు భూమిలో, నీటిలో ఇంకి జలవనరులు విషపూరితం అవుతాయి. ఈ నీటిని తాగే మూగజీవాలు, మనుషులు వ్యాధుల బారిన పడుతారు. హాని కలిగించే పీఓపీ విగ్రహాలను విడనాడి, మట్టి విగ్రహాలతో పండుగ జరుపుకొందాం. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం.

జె.పరమేశ్వరస్వామి తహసీల్దార్, పుత్తూరు

అనుమతి తప్పనిసరి



పుత్తూరు పట్టణంలో విగ్రహాల ఏర్పాటుకు పోలీసు అనుమతి తప్పని సరి. ఆయా కమిటీ సభ్యుల వివరాలు అందించాలి. విద్యుత్, పురపాలక సంఘం, పంచాయతీల అనుమతి తీసుకోవాలి. డీజే పాటకచ్చేరిలకు అనుమతి లేదు. రాత్రి 10 గంటలకు మైకులు ఆఫ్ చేయాలి. నిమజ్జనం తేదీ, సమయం తెలియజేయాలి. నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవు.

లక్ష్మీనారాయణ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, పుత్తూరు

వైభవంగా శ్రీవారి గొడుగుల ఊరేగింపు



పుత్తూరులో శ్రీవారి గొడుగుల ఊరేగింపు

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీవారి గొడుగుల ఊరేగింపు వైభవంగా జరిగింది. టీటీడీ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని చెన్నై నుంచి తిరుమలకు వెళుతున్న శ్రీవారి గొడుగులు శనివారం ఉదయం పుత్తూరుకు చేరుకోగానే మేళతాలతో ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక ఆర్డీఎం గేటు వద్ద శ్రీవారి పాదుకలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివానందస్వామి, కైలాస నందగిరిస్వామి, కృష్ణచైతన్యస్వామి ఊరేగింపును ప్రారంభించారు. అంబేడ్కర్ సర్కిల్, నగరం రోడ్డు, కాపువీధి, బజారువీధి, సుబ్రమణ్యంస్వామి ఆలయం, ధర్మరాజులస్వామి ఆలయం వరకు ఊరేగింపు కొనసాగింది. అడుగడుగునా శ్రీవారి పాదాలకు భక్తులు కర్పూరహారతులిచ్చారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు బాలకృష్ణస్వామి, రామన్, నాగరాజ్, కేశవరాజు, రాఘవులు, సంరదమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతినే పూజిద్దాం



నగరి: మట్టి వినాయక ప్రతిమలతో ర్యాలీ

- పాఠశాలల్లో ప్రతిమలు తయారు చేసిన విద్యార్థులు
- మట్టి గణపతితో గ్రామ వీధుల్లో ర్యాలీ



నగరి: మట్టివినాయక ప్రతిమలను తయారు చేస్తున్న విద్యార్థులు

నగరి : మట్టిగణపతినే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం అని మండలంలోని ముడిపల్లె జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు గట్టి నిర్ణయం తీసుకున్నారు. పాఠశాలలోనే విద్యార్థులు ఎంతో శ్రద్ధతో తీర్చిన ఆకృతుల్లో మట్టి వినాయక ప్రతిమలను తయారు చేశారు. ఆ ప్రతిమలకు పూజలు చేసి వాటిని చేతబట్టి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు టి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో మట్టి గణపతినే పూజిద్దాం అంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పండగలు, సంప్రదాయాల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతను కూడా కలిగించాలన్న ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఉపాధ్యాయులు కె.మురళీమోహన్, మునస్వామి, ఆనందమోహన్, శివశంకర్, భారతి, ఝాన్సీ, జయశ్రీ, గోపి తదితరులు పాల్గొన్నారు.

మండపాల వద్ద జాగ్రత్తలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సురేష్

నగరి : వినాయక ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే మండపాల వద్ద నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని సీఐ సురేష్ తెలిపారు. వినాయక చవితి నేపథ్యంలో శనివారం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉత్సవాల నిర్వహణ కమిటీలతో ఆయన సమావేశమయ్యారు. వినాయక విగ్రహాల ఏర్పాటుకు ఉత్సవ కమిటీ సభ్యులు తప్పనిసరిగా పోలీసులు, మున్సిపల్, విద్యుత్‌శాఖ అధికారుల అనుమతి తీసుకోవాలని తెలిపారు. మండపాల వద్ద అగ్నిమాపక, ఎలక్ట్రికల్ ప్రమాదాల నివారణ పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఊరేగింపు సమయంలో రోడ్లపై ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకూడదని తెలిపారు. నిమజ్జన సమయంలో ఈతరానివారు విగ్రహంతోపాటు నీళ్లలోకి దిగకుండా కమిటీ తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఉత్సవాల్లో మద్యం సేవించకూడదని, బాణాసంచా పేల్చకూడదన్నారు. డీజే సౌండ్ తక్కువగా పెట్టుకోవాలని, సంస్కృతిక కార్యక్రమాలు తప్ప ఇతర కార్యక్రమాలు నిర్వహించకూడదని పేర్కొన్నారు.మండపాల వద్ద ఎలాంటి సంఘటనలు జరిగినా కమిటీ నిర్వాహకులదే బాధ్యతన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ రాజాకుల్లాయప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

సిద్ధార్థలో ముందస్తు చవితి వేడుకలు



మట్టి వినాయకులను కొలుస్తున్న విద్యార్థులు

నారాయణవనం: సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ముందస్తు వినాయక చవితిని వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు మట్టి విగ్రహాలను తయారు చేశారు. విగ్రహాలను సుందరంగా అలంకరించి, పూజలు చేశారు. ఇంజనీరింగ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అన్నింటా తొలుత వినాయకుడిని పూజించడం మన సంప్రదాయమన్నారు. వినాయక చవితిని ప్రకృతికి చేదోడుగా జరుపుకోవాలన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ జనార్ధన్‌రాజు మాట్లాడుతూ రసాయనాలను అద్దిన ప్రతిమలతో కాకుండా మట్టితో తయారు చేసిన విగ్రహాలను పూజించాలని సూచించారు. వివిధ విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు, ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించండి



పుత్తూరులో ఎమ్మార్పీఎస్ దీక్ష

పుత్తూరు రూరల్: ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం పుత్తూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. నగరి నియోజకవర్గ మహాజన సోషలిస్టు పార్టీ ఇన్‌చార్జి శివయ్యమాదిగ మాట్లాడుతూ గత 29 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని బీజేపీ ప్రకటించిందని గుర్తు చేశారు. రెండవ దఫా అధికారంలోకి వచ్చినా నేటికీ హామీ నెరవేరలేదని విమర్శించారు. ఈనెల 18 నుంచి 22 వరకు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రెండు తెలుగు రాష్ట్రాల్లో రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి మునువేలుమాదిగ, మండల అధ్యక్షుడు అజిత్‌కుమార్, నాయకులు గోవిందరాజులు, గురవయ్య, తులసీరామ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ పొరను కాపాడుకుందాం



కార్వేటినగరం: మాట్లాడుతున్న ప్రిన్సిపల్ విజయులురెడ్డి



పాలసముద్రం: అవగాహన ర్యాలీ



ఓజోన్ ఫార్ములా 03 ఆకారంలో విద్యార్థులు

కార్వేటినగరం: వాతావరణ కాలుష్యం కారణంగా ఓజోన్ పొర దెబ్బతింటోందని..కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయులురెడ్డి తెలిపారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అధ్యాపకులు బాలసుబ్రమణ్యం ఆచారి, హరిబాబు, ధనంజయరెడ్డి పాల్గొన్నారు.

పాలసముద్రం: స్థానిక ఉన్నత పాఠశాల, తిరుమలరాజుపురం హైస్కూల్‌లో విద్యార్థులకు ఓజోన్ లేయర్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఓజోన్ ఫార్ములా 03 ఆకారంలో కూర్చొన్నారు. ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎంలు మీనాక్షి, దీనదయాలు, ఉపాధ్యాయులు ధనరాజ్, గుణశేఖర్, మురుగదాస్, ఉషారాణి పాల్గొన్నారు.